


13



సత్యం మందపాటి

# ఆరుద్ర ముద్ర

'ఆరుద్రా
శక్తి సముద్రా
చైతన్యానికి వ్రాలుముద్రా!
రాయిలాంటి
కొబ్బరికాయలాంటి పద్యాన్ని
కొబ్బరి లౌజులాంటి పజ్యంగా
తెన్గించిన దొరా!'

అని బాపూ రమణా ఆరుద్రకి అక్షరాభిషేకం పేరుతో ఆరుద్రాభిషేకం చేశారు.

ఆరుద్ర కవి. సినీవాలి. కథకుడు. నవలా రచయిత. మామూలు నవలలు కాదు. డిటెక్టివ్ నవలలు ఏనాడో వ్రాసిన రచయిత. 'రాముడికి సీతేమవుతుంది' అనే అతి సాధారణ విషయం మీద ఒక పరిశీలన గ్రంధం వాసిన అసాధారణ వ్యాసకర్త. అన్నిటికీ మించి తెలుగు భాషకీ, భాషా చరిత్రకీ, సాహిత్యానికీ, మీకూ నాకూ మనందరికీ 'ఆంధ్ర సమగ్ర సాహిత్య' భిక్ష పెట్టిన సాహితీ చారిత్రకుడు. చరితాత్ముడు. ఆయన గురించి నేను మీకు చెప్పటం, మిమ్మల్ని ఆ గొప్ప మనిషి గురించి అడగటం హాస్యాస్పదమని నాకు తెలుసు. కాకపోతే ఈ సాకుతో ఆ మహామహుడి గురించి మనం కాసేపు మాట్లాడుకోవటానికి, ఈ శీర్షికని వాడుకుందామనే స్వార్థంతో ఈసారి ఆరుద్ర గురించి వ్రాస్తున్నాను.

1. తెలుగు సాహిత్యం మీద తన ముద్ర వేసిన ఆరుద్ర అసలు పేరేమిటో తెలుసా?
2. 'కొండగాలి తిరిగింది గుండె వూసులాడింది' అనే పాటని ఆయన ఏ చిత్రానికి వ్రాశారు?
3. 'ఆంధ్ర సమగ్ర సాహిత్యం' ని ఆయన ఎన్ని సంపుటాలుగా వెలువరించారో తెలుసా?
4. 'సగము కమ్యూనిష్టు
   సగము కాపిటలిస్టు
   ఎందుకొచ్చిన రొష్టు

ఓ కూనలమ్మా!' లాంటి కూనలమ్మ పదాల ఆ కూనలమ్మ ఎవరో మరి?

5. ఆరుద్ర వ్రాసిన ఎన్నో పుస్తకాల్లో కనీసం నాలుగు పుస్తకాల పేర్లు చెప్పండి చూద్దాం.

6. ఆయన వ్రాసిన డిటెక్టివ్ నవలల్లో ఎర్ర గుర్రం మీద వచ్చే నాయకుడి పేరు గుర్తుందా?

7. శంకర్ జైకిషన్ సంగీత సారథ్యంలో రాజ్‌కపూర్ డబ్బింగ్ సినిమాకి అచ్చ తెలుగు పాటలు వ్రాశారు. ఒక పాటలో అయితే 'పందిట్లో పెళ్ళవుతున్నాదీ, కను విందవుతున్నాదీ', 'గోరింటాకూ కోయగబోతే గోళ్ళు కందేనూ' అనే చక్కటి పదాల పొందిక కూడా కనిపిస్తుంది. ఆ సినిమా పేరు?

8. 'స్కూలు కెళ్ళే పిల్లలే ముందు చేయాలి స్నానం, బాత్రూం క్యూలో నాన్నదే కడపటి స్థానం'
'ఆనందరావుగారు మాజీ జడ్జి, ఆయనకు చాల ఇష్టం కాంట్రాక్టు బ్రిడ్జి
అయినా వారి మధ్య ఆడేది రమ్మి, అందుక్కారణం వారెప్పుడూ డమ్మి'
ఇలాటి అంత్యప్రాసల పద్యాలకి ఆరుద్ర పెట్టిన పేరేమిటి?

9. 'ఎవడురా విష్ణుండు ఎవడురా జిష్ణుండు ఏగెనటు దాగెనెటు యీడ్చుకొని రండు' అని ఆయన వ్రాసినదానికి, మాధవపెద్ది సత్యం పాడగా, యశస్వి రంగారావు తన నటనతో అలరించిన ఆ చిత్రం పేరేమిటో తెలుసా?

10. 'నువ్వంటేనే నాకు మోజు, అలా రాసిస్తానే దస్తావేజు' అనే కొంటె పాటని కొసరాజుగారు వ్రాశారంటాడు మా స్నేహితుడు. నేనేమో ఆరుద్ర అంటాను. మీరెవరితో ఏకీభవిస్తారు?

## గతనెల మీకు తెలుసని నాకు తెలుసు - 12 జవాబులు

1. బాపు అసలు పేరు ఏమిటి?

   సత్తిరాజు లక్ష్మీనారాయణ

2. పెద్ద కళ్ళు, పొడుగాటి ముక్కు, పాములాంటి జడతో అందంగా వుండే అమ్మాయిని ఏమంటారు?

   బాపూ బొమ్మ

3. బాపు మొట్టమొదటి బొమ్మని ప్రచురించిన పత్రిక?

   బాల

4. ఆ బొమ్మని ప్రచురించిన సంవత్సరం ఏదో తెలుసా?

   1945

5. బాపు తీసిన మొట్టమొదటి తెలుగు చిత్రం?

   సాక్షి

6. ఈనాటి అనిల్‌కపూర్‌ని, అనిల్‌కుమార్‌గా బాపు మొట్టమొదటిసారిగా పరిచయం చేసిన తెలుగు సినిమా?

   వంశవృక్షం

7. రామాయణ ప్రియుడు బాపు, భారత కథతో తీసిన సాంఘిక తెలుగు సినిమా?

మనవూరి పాండవులు

8. బాపు రంగుల చిత్రాలతో అలంకరించిన గోదాదేవి కావ్యం?

తిరుప్పావై

9. ఎన్నో విదేశీ బహుమతులు సంపాదించిన బాపు రమణల దృశ్య కావ్యం ఈ సినిమా.

సీతా కల్యాణం

10. రచయిత బాపు ఆంధ్ర సచిత్ర వారపత్రికలో 1957లో లక్ష్మీనారాయణ పేరుతో ఒక కథ వ్రాశారు. దాని పేరేమిటో తెలుసా?

మబ్బూ వానా - మల్లె వాసనా

11. ఒక హీరోయిన్‌తో తీసిన సినిమానే, ఎన్నో ఏళ్ళ తర్వాత బాపు ఆవిడ కొడుకుని హీరోగా పెట్టి మళ్ళీ తీశారు. ఆ రెండు సినిమాల పేర్లూ చెప్పండి చూద్దాం?

విజయనిర్మలతో బంగారు పిచిక. నరేష్‌తో పెళ్ళికొడుకు.

12. 'కొంటె బొమ్మల బాపు కొన్ని తరముల సేపు గుండె ఊయల ఊపు' అని పొగిడిన కవి ఎవరు?

ఇంకెవరు. మీరనుకున్నట్టు ఆరుద్రే





